క్లుప్తంగా

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే వనమా

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం సుజాతనగర్ మండలంలోని 22 మంది కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు రూ.22 లక్షలు విలువైన చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో భూక్యా విజయలక్ష్మి, భూక్యా రాంబాబు, తహసీల్దార్ సునీల్‌రెడ్డి, సర్పంచ్‌లు రవి, హతీరామ్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, జైత్‌రామ్, బోడ గణేష్ పాల్గొన్నారు.

సబ్సిడీపై జీలుగు విత్తనాలు పంపిణీ

పాల్వంచ: సబ్సిడీపై జీలుగు విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని పాల్వంచ సొసైటీ అధ్యక్షుడు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. బుధవారం సొసైటీ కార్యాలయంలో రైతులకు విత్తనాల పంపిణీ ప్రారంభించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ.. 30 కిలోల బస్తా సబ్సిడీపై రూ.842కు అందజేస్తున్నామన్నారు. రైతులు భూమి పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్‌తో వచ్చి సొసైటీ కార్యాలయంలో పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఓ శంభోశంకర్, సొసైటీ ఉపాధ్యక్షుడు కాంపెల్లి కనకేశ్, డైరెక్టర్లు కనగాల నారాయణ, బుడగం రామ్మోహన్‌రావు, చౌగాని పాపారావు, జరబన సీతారంబాబు, మైనేని వెంకటేశ్వర రావు, కిషన్, సీఈఓ లక్ష్మీనారాయణ, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ

పాల్వంచ: జూన్ 6, 7వ తేదీల్లో మేడ్చల్‌లో జరిగే ఏఐటీయూసీ మున్సిపల్ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే.సాబీర్‌పాషా పిలుపునిచ్చారు. బుధవారం పాల్వంచలో మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు చాలీచాలనీ వేతనాలతో పనిచేస్తున్నారని, రెగ్యులర్ చేయాలని ఏళ్ల తరబడి పోరాటం చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. అనంతరం మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఘం అధ్యక్షుడు నారపోగు రామయ్య, కార్యదర్శి మాదుగుల ప్రసాద్, కంచర్ల శ్రీను, అరివెండ్ల మరియమ్మ, సారమ్మ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల వితరణ

కొత్తగూడెంఅర్బన్: జిల్లా గ్రంథాలయానికి రూ.3500 విలువ చేసే పుస్తకాలను పట్టణానికి చెందిన మునిపల్లె లక్ష్మి జిల్లా గ్రంథాలయ సంస్థకు బుధవారం వితరణగా అందజేశారు. పుస్తకాలను అందజేసిన లక్ష్మికి గ్రంథ పాలకురాలు జి.మణి మృదుల, చైర్మన్ దిండిగల రాజేందర్ కృతజ్ఞతలు తెలిపారు.

వీధి కుక్కలకు వ్యాక్సిన్

కొత్తగూడెంఅర్బన్: వీధి కుక్కలతో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి తెలిపారు. బుధవారం స్పెషల్ శానిటేషన్‌లో భాగంగా వీధి కుక్కలను పట్టే కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ పరిశీలించారు. మాట్లాడుతూ.. పట్టిన కుక్కలకు వ్యాక్సిన్ వేయించి వదిలివేయాలని సిబ్బందికి సూచించారు. పెంపుడు కుక్కలను ఇంట్లో నుంచి బయటకు రాకుండా చర్యలు తీసుకోవాలని, యజమానుల పర్యవేక్షణలో మాత్రమే బయటకు వదలిపెట్టాలని, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ వీరభద్రచారి, అశోక్, జవాన్లు రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఏరియాలో ఆటల పోటీలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం జక్కం రమేష్ ఆదేశాల మేరకు రుద్రంపూర్ సేవా సమితి సభ్యులు బుధవారం ఆటల పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఫాతిమా రజాక్ హాజరయ్యారు. జీకే ఓసీ సీనియర్ పీఓ ఎం.శ్రావణ్‌కుమార్, టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ ఎండీ రజాక్, సేవాసమితి కోఆర్డినేటర్ సీహెచ్ సాగర్, సిబ్బంది శ్రీనివాసరెడ్డి, రుద్రంపూర్ సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

ఇల్లెందు: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సింగరేణి ఇల్లెందు ఏరియాలో మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలను బుధవారం జీఎం కార్యాలయం ఆవరణలో నిర్వహించారు. జీఎం షాలేమురాజు ఆదేశాల మేరకు వివిధ విభాగాలు, గనులలో పని చేస్తున్న మహిళా ఉద్యోగులకు త్రోబాల్, బాల్ ఇన్ ద బకెట్, మ్యూజికల్ చైర్ తదితర ఆటలను నిర్వహించారు. విజేతలకు జూన్ 2 తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బహుమతులు అందజేస్తారు. కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సాయి స్వరూప్, సేవా సమితి సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

వేసవిలో మూగజీవాలు జరభద్రం

- గతంలో కంటే ఈ ఏడాది అధిక ఉష్ణోగ్రతలు
- ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే మేతకు తీసుకెళ్లాలి


మేతకు వెళ్తున్న తెల్లజాతి పశువులు

జూలూరుపాడు: వేసవి కాలంలో పశువులు, మూగజీవాల(గొర్రెలు, మేకలు) రక్షణ విషయంలో పశు పోషకులు, పెంపకందారులు జాగ్రత్తలు తీసుకోవాలి. వేసవి ఉష్ణోగ్రతలు గతంలో కంటే ఈ ఏడాది అధికంగా నమోదు అవుతున్నాయి. మారుతున్న వాతావరణ మార్పులకు అనుగుణంగా పశువులు, మేకలు, గొర్రెలును శాస్త్రీయ యాజమాన్య పద్ధతిలో పెంచడం వల్ల వాటి ఉత్పాదక శక్తి తగ్గకుండా ఆశించిన ఫలితాలు సాధించవచ్చు. అధిక ఉష్ణోగ్రత, గాలి ప్రసరణ సక్రమంగా లేకపోవడం, పాకలు, కొట్టాలు, షెడ్లలో అధిక సంఖ్యలో పశువులు, జీవాలు కిక్కిరిసి ఉండటం, ఉక్కపోత, నీటి సౌకర్యం లేకపోవడం వల్ల వడదెబ్బకు గురవుతాయి. పాడి ఆవులు, గేదెల్లో పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గుతుంది. అందుకని అధికంగా ఉదయం పచ్చిగడ్డి సాయంత్రం ఎండుగడ్డిని సమృద్ధిగా అందించాలి. పాలు ఇచ్చే పశువులకు పశు దాణా నీటితో కలిపి ఇవ్వాలి. మినరల్ మిక్చర్, ఉప్పు కలిపిన ద్రావణం ఇవ్వడం ఎంతో మంచిది. ఎండకాలంలో పశువులు, గొర్రెలు, మేకలను సంరక్షించుకోవడానికి ఉదయం, సాయంత్రం మాత్రమే మేతకు తీసుకెళ్లాలి. వేసవితాపానికి గురైన పశువుల్లో వ్యాధి నిరోధక శక్తి తగ్గడం వల్ల ఇతర వ్యాధులు సంక్రమించే అవకాశం ఉంటుంది. వ్యాధి నిరోధక టీకాలు ఇది వరకు వేయించని పశువులు, మేకలు, గొర్రెలకు గాలికుంటు వ్యాధి, గొంతు వాపు, జబ్బ వాపు వ్యాధి నివారణ టీకాలు తక్షణమే వేయించాలి. వేసవి తాపానికి గురైన పశువులు అధిక శరీర ఉష్ణోగ్రతతోపాటు, అధికంగా శ్వాస తీసుకుంటూ బాధపడుతుంటాయి. ఇలాంటి సమయంలో పశువుల తల, శరీర భాగాలను నీటితో తడపడం తోపాటు పశువైద్యాధికారులతో చికిత్స అందించాలి. జూలూరుపాడు మండలంలో తెల్లజాతి పశువులు 6,270, నల్లజాతి పశువులు 5,434, మేకలు 5,512, గొర్రెలు 7,655 మొత్తం 24,871 ఉన్నాయి.


పొలం నుంచి ఇంటికి వస్తున్న మేకల మంద

ఎండుగడ్డినే మేపుతున్నాం



ఎండాకాలం కావడంతో ఉదయం, సాయంత్రం సమయాల్లోనే పశువులను మేత కోసం బయటకు వదులుతున్నాం. మేతకు వెళ్లి వచ్చిన పశువులను మధ్యాహ్నం నీళ్లతో తడుపుతున్నాం. పచ్చిగడ్డి లేదు కాబట్టి ఎండుగడ్డినే వేస్తున్నాం. జూన్ వరకు పశువులను జాగ్రత్తగా చూసుకోవాలి.

– యల్లంకి సత్యనారాయణ, రైతు, జూలూరుపాడు

జాగ్రత్తలు పాటిస్తున్నాం



ఎండాకాలంలో పాడి గేదెల పట్ల జాగ్రత్తలు పాటిస్తున్నాం. ఉదయమే పొలానికి తీసుకెళ్లి ఎండ తీవ్రత పెరగకముందే ఇంటికి తోలుకొస్తున్నాం. ప్రస్తుతం పచ్చిగడి లేకపోవడంతో పాల ఉత్పత్తి బాగా తగ్గింది. ఎండుగడ్డిని మాత్రమే మేపుతూ తగు జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

– బానోత్ బాలు, రైతు, వెంగన్నపాలెం

వడదెబ్బ తగలనీయొద్దు



పశువులు, జీవాలు వడదెబ్బ బారినపడకుండా రైతులు, పెంపకందారులు జాగ్రత్తలు తీసుకోవాలి. ఉదయం, సాయంత్రం వేళల్లోనే మేతకు తీసుకెళ్లాలి. వడదెబ్బకు గురైన పశువులను వెంటనే చల్లని గాలి వీచే ప్రదేశంలో ఉంచాలి. పశు వైద్యసిబ్బందికి సమాచారం ఇచ్చి వైద్యసేవలు అందించాలి.

– డాక్టర్ బద్దులాల్, పశువైద్యాధికారి జూలూరుపాడు

జాతీయ సంఘాలపై ఐఎఫ్‌టీయూ ధ్వజం



మాట్లాడుతున్న ప్రసాద్

సూపర్‌బజార్(కొత్తగూడెం): 11వ వేజ్ బోర్డు సమావేశంలో సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సమస్యలను జాతీయ కార్మిక సంఘాలు కనీసం చర్చించకపోవడం అవమానకరమని ఐఎఫ్‌టీయూ అనుబంధ సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి గొని నాగేశ్వరరావు, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు డి.ప్రసాద్ విమర్శించారు. స్థానిక ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో బుధవారం జరిగిన యూనియన్ ముఖ్య కార్యకర్తల సమావేశం రీజియన్ అధ్యక్షుడు మోత్కూరి మల్లికార్జునరావు అధ్యక్షతన జరిగింది. మాట్లాడుతూ.. దశాబ్దకాలంగా సింగరేణి కాంట్రాక్టు కార్మికులు హైపవర్ వేతనాల కోసం, ఇతర సమస్యల పరిష్కారం కోసం ఆందోళనలు చేస్తున్నారన్నారు. దీనిలో భాగంగానే గతంలో 19రోజులు సమ్మె చేస్తే విప్లవ కార్మిక సంఘాలను కాదని జాతీయ కార్మిక సంఘాలైన ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎన్‌టీయూసీ, బీఎంఎస్‌లు కొన్ని డిమాండ్లతో సంతకాలు చేసి సమ్మెను మధ్యలో విరమింపజేశారన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు అవే సమస్యల పరిష్కారం కోసం ఐఎఫ్‌టీయూ అనేక ఆందోళనా కార్యక్రమాలను చేపట్టిందని చెప్పారు. కానీ కలకత్తాలో ఇటీవల జరిగిన 11వ వేజ్‌బోర్డు సమావేశంలో జాతీయ కార్మిక సంఘాలు కాంట్రాక్టు కార్మికుల సమస్యలను చర్చించకుండా సంతకాలు చేయడం నిర్లక్ష్యానికి నిదర్శనం అని ధ్వజమెత్తారు. కాంట్రాక్టు కార్మికులు జాతీయ కార్మిక సంఘాల నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. ఎస్.సంజీవ్, సతీష్, చంద్రశేఖర్, కిషన్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ వేలంపాట

పాల్వంచరూరల్: కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో పలు వ్యాపార దుకాణాలు, అమ్మవారి చీరలు సేకరణ, స్క్రాప్ కొనుగోలుకు 26వ తేదీన ఉదయం 10గంటలకు బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు ఈఓ ఎన్.రజనీకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగినవారు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని పేర్కొన్నారు.

ఏరియాలో పర్యటించిన చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియాలో సెక్యూరిటీ ఆఫీసర్ సీహెచ్ శశిధర్‌రాజు బుధవారం పర్యటించారు. చెక్ పోస్టులను తనిఖీ చేసి బొగ్గు లారీల అవుట్‌పుట్‌లను పరిశీలించారు. విధుల్లో ఉన్న గార్డుల నుంచి సమాచారం తెలుసుకున్నారు. విధుల్లో అప్రమత్తగా ఉండాలని, సంస్థకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా విధులు నిర్వహించాలని ఆదేశించారు.

29న స్పాట్ కౌన్సెలింగ్

కొత్తగూడెంఅర్బన్: 29న ఈఎంఆర్ఎస్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి స్పాట్ కౌన్సెలింగ్ భద్రాచలంలో జరుగుతుందని ఈఎంఆర్ఎస్ కళాశాల ప్రిన్సిపాల్ స్వర్ణలత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన విద్యార్థులు మాత్రమే అర్హులని, 2022–23 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు అన్ని సర్టిఫికెట్లతో హాజరు కావాలని వివరించారు. పాల్వంచ ఈఎంఆర్ఎస్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ కోర్సులలో ఖాళీగా ఉన్న సీట్లకు కౌన్సెలింగ్ జరుగుతుందని వివరించారు.

పిడుగు పాటుకు తప్పిన ప్రమాదం

టేకులపల్లి: పిడుగు పడి తృటిలో ప్రమాదం తప్పింది. స్థానికుల కథనం... బొమ్మనపల్లి – కొత్తతండా(జి) క్రాస్‌రోడ్డు మార్గంలోని ఓ చెట్టుపై బుధవారం రాత్రి పిడుగు పడింది. దీంతో పక్కనే ఉన్న దుకాణదారులు, కొనుగోలుదారులు భయభ్రాంతులకు గురయ్యారు. కిరాణ షాపు పక్కనే ఉన్న చెట్టుపై పిడుగు పడటంతో షాపు వారికి తృటిలో ప్రమాదం తప్పినట్లయింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించ లేదు.

విత్తన దుకాణాల్లో తనిఖీలు

జూలూరుపాడు: కాకర్ల, జూలూరుపాడులోని విత్తన, ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో బుధవారం వ్యవసాయశాఖ అధికారులు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జిల్లా టెక్నికల్ సహాయ వ్యవసాయ సంచాలకులు జి.లాల్‌చంద్ నేతృత్వంలోని జూలూరుపాడు ఏఓ ఎస్.రఘుదీపిక, టాస్క్‌ఫోర్స్ హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు, కానిస్టేబుల్ విజయ్ పురుగుమందులు, విత్తన, ఎరువుల దుకాణాల్లో సోదాలు చేశారు. స్టాక్ రిజిష్టర్లు, రికార్డులు, పురుగు మందులకు సంబంధించిన ధ్రువపత్రాలతోపాటు, స్టాక్ బోర్డుపై వివరాల నమోదును పరిశీలించారు. లాల్‌చంద్ మాట్లాడుతూ.. వానాకాలం సీజన్ ప్రారంభం కానున్న దృష్ట్యా విత్తన, ఎరువులు, పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేస్తున్నామన్నారు. పురుగు మందుల వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా విక్రయాలు చేపట్టాలన్నారు.


తనిఖీ చేస్తున్న అధికారులు, పోలీసులు

ప్రతి వ్యాపారి దుకాణంలో లైసెన్స్‌ను ప్రదర్శించాలని చెప్పారు. రైతులు దుకాణాల్లో మందులు, ఎరువుల ధరల పట్టికను చూడటంతోపాటు విక్రయిస్తున్న మందులకు లైసెన్స్ ఉండాలన్నారు. రైతులు తప్పనిసరిగా అధీకృత డీలర్ల వద్దనే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసి బిల్లులు పొందాలని సూచించారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తూ పట్టుబడ్డ వ్యాపారులపై పీడీ యాక్ట్ నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

ఇంటింటా ఇంకుడుగుంతలు ఉండాలి

పాల్వంచరూరల్: మండలంలోని గ్రామాల్లో ఇంకుడుగుంతలు లేని ఇళ్లల్లో ఇంకుడు గుంతలు నిర్మాణం చేసుకునే విధంగా చూడాలని ఎంపీడీఓ బి.అప్పారావు ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రతి గ్రామపంచాయతీలో ఉపాధి పనుల్లో కూలీల సంఖ్యను పెంచేవిధంగా చర్యలు తీసుకోవాలని, సర్వే చేసి ఇంకుడుగుంతలు లేని ఇళ్లను గుర్తించాలన్నారు. సమావేశంలో ఎంపీఓ బి.నారాయణ, ఏపీఓ పి.రంగా పాల్గొన్నారు.

'ప్రజాగర్జన'ను జయప్రదం చేయండి




పాల్వంచ: మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు, టేకులపల్లి: వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

పాల్వంచ: కులమతాలు, ప్రాంతాలు, ప్రజల మధ్య చిచ్చురేపుతున్న బీజేపీకి 2024లో జరిగే సార్వత్రిక ఎన్నికలు చివరి ఎన్నికలని, కర్ణాటక ఎన్నికల ఫలితాలే బీజేపి పతనానికి నాంది అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. బుధవారం పట్టణంలోని పలు బస్తీల్లో కార్మిక సంఘాల కార్యాలయాల వద్ద జూన్ 4న కొత్తగూడెంలో జరగనున్న ప్రజా గర్జన సభ విజయవంతం చేయాలని ప్రచారం నిర్వహించారు. మాట్లాడుతూ.. అవినీతిపరులు, అక్రమార్కులు బీజేపీ పాలనలో పెరిగిపోయారని, వారంతా బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ శక్తులేనన్నారు. ఎస్‌కె.సాబీర్ పాషా, ముత్యాల విశ్వనాథం, అడుసుమల్లి సాయిబాబు, పూర్ణచందర్‌రావు, రాహుల్, నాగరాజు పాల్గొన్నారు.

ఇల్లెందు: దేశ ప్రజలను దగా చేస్తున్న ప్రధాని మోదీ గద్దె దిగే వరకు పోరాటం తప్పదని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా అన్నారు. బుధవారం ఇల్లెందులోని సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేట్ కంపెనీలకు దేశాన్ని పారిశ్రామిక రంగాన్ని దోచి పెడుతున్నారని విమర్శించారు. ప్రజాపోరు యాత్ర స్ఫూర్తితో జూన్ 4న కొత్తగూడెంలో సీపీఐ జిల్లా కమిటీ భారీ బహిరంగ సభ నిర్వహిస్తోందని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మిర్యాల రంగయ్య, కె.సారయ్య, ఏపూరి బ్రహ్మం, దేవరకొండ శంకర్ పాల్గొన్నారు.

టేకులపల్లి: జూన్ 4న కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో జరగనున్న సీపీఐ ప్రజాగర్జన బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు గుగులోత్ రాంచందర్ నాయక్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ప్రజాగర్జన వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేసేంత వరకూ సీపీఐ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామన్నారు. దళితబంధుతో పాటు గిరిజన బంధు కూడా అమలు చేయాలని కోరారు. సింగరేణి కాంట్రాక్టు కార్మికులను పర్మనెంట్ చేయాలని, అవుట్ సోర్సింగ్ కార్మికులకు ఒకటో క్యాటగిరీ జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గుగులోత్ శ్రీను, వాసం భద్రయ్య, అయిత శ్రీరాములు, తేజావత్ లక్ష్మణ్, సోనీ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి కేరాఫ్ బీఆర్ఎస్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరిప్రియ

టేకులపల్లి: అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా బీఆర్ఎస్ పార్టీ నిలుస్తోందని ఇల్లెందు ఎమ్మెల్యే బాణోతు హరిప్రియ అన్నారు. ఈ మేరకు బుధవారం బోడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఆమె పాల్గొని మాట్లాడారు. జూన్ 2 – 23 వరకు దశాబ్ది సంబరాలు ఎంతో ఘనంగా జరుపుకోబోతున్నట్లు చెప్పారు. రాష్ట్ర అవతరణకు ముందు, తరువాత పరిశీలిస్తే రూ.కోట్ల అభివృద్ధి జరిగిందని తెలిపారు. ఒక్క టేకులపల్లి మండలంలోనే రూ.390.63 కోట్ల అభివృద్ధి పనులు చేసినట్లు చెప్పారు. పల్లెల అభివృద్ధి, ప్రజల ముఖాల్లో ఆనందమే మాకు ముఖ్యం.. కులం, మతం, ప్రాంతం చూడకుండా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. నేను టీఆర్ఎస్‌లో చేరుతున్న సమయంలోనే సీతారామ ప్రాజెక్టుపై హామీ ఇచ్చాకనే పార్టీలో చేరానని దీంతో సీఎం కేసీఆర్ రోళ్లపాడులో సీతారామ నీటి పారుదలకు రూ.320 కోట్లు కేటాయించడం జరిగిందని, టేకులపల్లి మండలంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందుతుందని త్వరలోనే పనులు ప్రారంభం అవుతాయన్నారు. జూన్ 24 నుంచి పోడు భూములకు పట్టాలు పంపిణీ ప్రారంభం అవుతాయని, స్వయంగా నేనే మండలాల్లో పోడు పట్టాలు పంపిణీ చేస్తానన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా మొత్తం మీద ఇల్లెందు నియోజకవర్గంలోనే అత్యధిక మంది రైతులకు పోడు పట్టాలు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. నియోజకవర్గానికి మూడు వేల డబుల్ బెడ్ రూం ఇళ్లు వస్తున్నాయని, సొంత స్థలం ఉన్న నిరుపేదలకు, ప్రకృతి వైపరీత్యాల్లో ఇళ్లు కోల్పోయిన వారికి కేటాయించడం జరుగుతుందని తెలిపారు. ఎమ్మెల్యేగా వంద శాతం అభివృద్ధికి కృషి చేశానని, 90–95 శాతం వరకు పనులు పూర్తి చేయడం జరిగిందని మిగిలిన పనులన్నీ అందరి ఆశీర్వాదంతో గెలిచిన తరువాత పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. 14 పంచాయతీల నుంచి జనం ట్రాక్టర్లు, ఆటోల్లో తరలివచ్చారు. కార్యక్రమంలో బాణోతు హరిసింగ్, ఎంపీపీ భూక్యా రాధ, దిండిగల రాజేందర్, పులిగళ్ల మాధవరావు, బొమ్మెర్ల వరప్రసాద్, బోడ బాలు, చీమల సత్యనారాయణ, కోటేశ్వరరావు, చంద్రశేఖర్, శ్యాం, బాలు, చింత వెంకటేశ్వర్లు, నరేష్, మౌలానా, బీఎస్ఆర్, వేణు, సైదులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

'గడల' అవినీతిపై విచారణ జరిపించాలి


సామ్ రిజ్వీకి వినతిపత్రం అందజేస్తున్న రాజేష్‌నాయక్

కొత్తగూడెంటౌన్: తెలంగాణ రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాసరావు అవినీతి అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం ఆరోగ్య వైద్య కుటుంబ సంక్షేమశాఖ ప్రభుత్వ కార్యదర్శి సామ్ రిజ్వీకి వినతిపత్రం అందజేసినట్లు ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోతు రాజేష్‌నాయక్ తెలిపారు. మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం ఐదో షెడ్యూల్ ప్రాంతమైన కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండలం పూర్తిగా ఏజెన్సీ ప్రాంతం. ఇక్కడ ఉద్యోగాలు పూర్తిగా గిరిజనులతోనే భర్తీ చేయాల్సి ఉండగా.. హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాసరావు సమీప బంధువైన బీసీ సామాజిక వర్గం వారికి ఏఎన్ఎం ఉద్యోగం ఇచ్చినట్లు ఆరోపించారు.

తనకు రాజకీయంగా ఉపయోగపడాలనే విధంగా ఉద్యోగాల్లో గిరిజనేతరులను నియమించినట్లు విమర్శించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో బదిలీలు, ప్రమోషన్లు ఇతర వ్యవహారాలను నడిపిస్తున్నారని పేర్కొన్నారు. కొత్తగూడెం జిల్లాలో డిప్యూటేషన్‌పై నియామకాలు చేయడం జరుగుతుందని, ఇలా చేస్తున్న గడల శ్రీనివాసరావుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాయం సత్యనారాయణ, బద్రునాయక్ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ లావాదేవీలపై అవగాహన


మాట్లాడుతున్న డీపీఎం రమాకాంత

ఇల్లెందురూరల్: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మండలంలోని రాఘబోయినగూడెం గ్రామపంచాయతీ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో బుధవారం డిజిటల్ లావాదేవీలు, ఆర్థిక అక్షరాస్యతపై డిస్ట్రిక్ట్ ప్రాజెక్టు మేనేజర్ (డీపీఎం) రమాకాంత అవగాహన కల్పించారు. పంచాయతీ పరిధిలోని పొదుపు సంఘాల మహిళలు, గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. నగదు బదిలీ, జమ, బీమా సౌకర్యాలు, ఆయుష్మాన్ భారత్ చెల్లింపులు, బ్యాంకు సేవలు వినియోగించుకోవడం, లావాదేవీలు, రికార్డుల లభ్యత వంటి అంశాలపై సమగ్రంగా వివరించారు. వివిధ యాప్‌ల ద్వారా నగదు లావాదేవీలు సురక్షితంగా ఎలా జరుపుకోవాలో ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. ఇలాంటి లావాదేవీల వల్ల ఇరువర్గాలకు నమ్మకం ఏర్పడుతుందన్నారు. వృథా ఖర్చులు కూడా అదుపులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో సుదిమళ్ల ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ రవిచందర్, సర్పంచ్ కుమ్సోత్ జానకి, ఎంపీటీసీ రజినీ, ఏపీఎం దుర్గారావు, సీసీ లాలయ్య, వీఎల్ఈ బొర్ర యశోద, వార్డు సభ్యురాలు నరసమ్మ పాల్గొన్నారు.

పీవైఎల్ సభలను జయప్రదం చేయండి


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇల్లెందురూరల్: జూన్ 5, 6 తేదీలలో ఖమ్మంలో నిర్వహిస్తున్న పీవైఎల్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ మండలంలోని నెహ్రూనగర్ గ్రామంలో ప్రచార పోస్టర్లను పీవైఎల్ రాష్ట్ర కార్యదర్శి మోకాళ్ల రమేష్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించకుండా మోసం చేస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాలు ప్రకటించి పరీక్ష పత్రాలను లీకైనా సరైన చర్యలకు ఉపక్రమించకుండా తాత్సారం చేస్తూ యువత ఆకాంక్షలతో ఆటలాడుకుంటోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగాలు ప్రకటించకుండా తాత్సారం చేస్తోందని ధ్వజమెత్తారు. యువతకు కనీసం స్వయం ఉపాధి లక్ష్యంగా సబ్సిడీపై రుణాలు కూడా ఇవ్వకుండా నిస్సహాయులను చేస్తున్నాయని వాపోయారు.

యువత పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని ప్రజల్లోకి తీసుకెళ్లి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ లక్ష్యంగా రాష్ట్ర మహాసభలు ఉంటాయని చెప్పారు. మహాసభలకు యవత అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. సమావేశంలో రావూరి ఉపేందర్, ప్రవీణ్, రవి, నవీన్, క్రాంతి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

విరిగిపడిన విద్యుత్ స్తంభాలు, చెట్లు

జూలూరుపాడు: మండలంలోని నల్లబండబోడు గ్రామంలో బుధవారం గాలి దుమారంతో భారీ వర్షం కురిసింది. దీంతో చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. గ్రామంలో మూడు విద్యుత్ స్తంభాలు విరిగిపడటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో నల్లబండబోడు గ్రామ ప్రజలు అంధకారంలోనే ఉన్నారు. ప్రస్తుతం విద్యుత్ సరఫరా చేసే అవకాశం లేకపోవడంతో గురువారం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించనున్నట్లు విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు.

అటెన్షన్ ప్లీజ్

నిరుపయోగంగా రెవెన్యూ భవనం

స్థానిక తహసీల్దార్ కార్యాలయ సముదాయంలో గ్రామ రెవెన్యూ అధికారుల కార్యాలయ భవనం నిరుపయోగంగా ఉంది. ప్రభుత్వం గ్రామ రెవెన్యూ అధికారుల వ్యవస్థను రద్దు చేయడంతో సంబంధిత భవనం మూతపడింది. దీంతో భవనం లోపల చెత్తచెదారం, బూజు పట్టడంతోపాటు, తలుపులు, కిటికీలు దెబ్బతిన్నాయి. అలాగే విషసర్పాలకు నిలయంగా మారింది. సంబంధిత అధికారులు స్పందించి నిరుపయోగంగా ఉన్న ఆ భవనాన్ని ఇతర కార్యకలాపాలకు వినియోగించే విధంగా చర్యలు తీసుకోవాలని, లేదంటే పూర్తిగా



తొలగించాలని మండల ప్రజలు కోరుతున్నారు. - జూలూరుపాడు

ప్రశ్నించాల్సిన అధికారి : శారద, తహసీల్దార్,
సెల్ నంబర్: 9392919728

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

కె. ప్రదీప్ కుమార్, ACM - 70132 21824 లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యాకూబ్ పాషా - 80083 21148 భద్రాచలం కె. హరేంద్ర - 99632 02011
పినపాక ఎస్. లక్ష్మయ్య - 80742 70476 ఇల్లందు బి. కిషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎస్. దుర్గాంప్రసాద్ -79979 58226 టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎన్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

టి. రాజేష్ - 90102 23783
ఎ. నాగేశ్వరరావు - 97054 44183
యస్.రవిబాబు - 99516 02914
కె. మధు - 97059 44416
ఎన్. శేషయ్య - 99121 99148